క్లుప్తంగా

16న రౌండ్ టేబుల్ సమావేశం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప నగరం రామాంజనేయపురం లో కాలువను ఆక్రమించి లేఔట్ వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, కాలువ యధాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 16న కడప ప్రెస్ క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ కడప నగర కార్యదర్శి ఎ.రామమోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అనాదిగా వుంటున్న కాల్వ పూర్తిగా మూసి చేయడం వల్ల సెంట్రల్ జైలు నుండి పోలీస్ క్వార్టర్లు, మహిళా పాలిటెక్నిక్, చర్చి లాంటి ప్రాంతాలు వర్షం వస్తే మునకకు గురవుతున్నాయని తెలిపారు. దీనిని నివారించడానికి కాలువను యధాతథంగా కొనసాగించి నీరు కిందికి ప్రవహించేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమస్య పరిష్కారం కోసం జరిగే అఖిలపక్ష, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశానికి అన్ని రాజకీయపార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, ప్రతినిధులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

భూమి అప్పగించాలని రిలే దీక్ష

కడప సెవెన్ రోడ్స్: ఎన్నాళ్ళుగానో తాము సాగు చేసుకుంటున్న భూములకు సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాలని కోరుతూ నెహ్రూ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నాగిపోగు నారాయణ, మహబూబ్ బాష ఆయన కుటుంబ సభ్యులు రిలే నిరాహార దీక్ష చేశారు. కాశినాయన మండలం మూలపల్లె గ్రామంలోని సర్వే నెంబర్ 41 లో 3.69 ఎకరాలు, సర్వే నెంబర్ 44లో 4 ఎకరాల భూమికి సర్వే నిర్వహించి తమకు అప్పగించాలని కోరినా అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు ఆరోపించారు. సదరు భూమిని కొంతమంది ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కబ్జాదారుల నుంచి తమకు ప్రాణ హాని ఉందని, రక్షణ కల్పించాలని కోరారు.

త్రైత భగవద్గీతపై ప్రచారం

కడప సెవెన్ రోడ్స్: త్రైత సిద్ధాంత భగవద్గీతపై త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం కడప మండలం మోడమీద పల్లె గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోదానంద యోగిశ్వరులు రచించిన ఈ గ్రంథంలోని అంశాలను వారు ప్రజలకు వివరించారు. సమాజంలోని కులమతాల అసమానతలు గీత జ్ఞానం ద్వారా తొలగించబడతాయని సమితి అధ్యక్షులు నవనీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కె. వెంకట రమణ, సి. ఈశ్వర్, సదానందుడు, యల్లారెడ్డి, రామనాధం, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

కడప సెవెన్ రోడ్స్: శ్రావణ మాసం రానున్న నేపథ్యంలో కడప సమీపంలోని పాలకొండలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని తాళపత్ర గ్రంధ లిపి నిపుణులు మునికుమార్ అధికారులను కోరారు. పాల కొండ ఆలయ ప్రాంగణం వద్ద దేవస్థాన స్థలం అటవీశాఖ స్థలాలను స్పష్టంగా చూపిస్తూ సర్వే నిర్వహించాలని కోరారు. వెయ్యి సంవత్సరాల చరిత్ర కలిగిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన పాలకొండరాయ స్వామి ఆలయ బాగోగులు అధికారులు పట్టించుకోవాలన్నారు. పాలకొండకు ఏకో టూరిజం బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు.

కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు



చిలకల బావి వీధిలో కాల్వ కట్ట వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం

కడప కార్పొరేషన్: కడప నగరం చిలకల బావి వీధిలో ఈనెల 12వ తేది హిటాచీ ఢీ కొనడంతో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. దీనిపై 13వ తేది సాక్షిలో ‘తప్పిన ప్రమాదం’ శీర్షికన వార్త ప్రచురించింది. దీనిపై స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు సోమవారం కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి, లైన్లు లాగి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు మున్నా విద్యుత్ శాఖ అధికారులకు ఎప్పటికప్పుడు ఫోన్లు చేసి అన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా అయ్యేందుకు తన వంతు కృషి చేశారు.

నిరుద్యోగ భృతి అమలేదీ..?

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన మాట నిలబెట్టుకుని నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇవ్వాలని సోమవారం కడప ఆర్డీఓ పి. జాన్ ఇర్విన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ కడప జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శివ నాగేంద్ర, కడప నగర అధ్యక్షులు ప్రదీప్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తాం, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం, ఇవి రెండు కాకపోతే నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని చెప్పి నిరుద్యోగుల ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం దేవుడెరుగు.. ఉన్న ఉద్యోగాలను పీకేశారన్నారు. రాష్ట్రంలో ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా పనిచేసిన వాలంటీర్ వ్యవస్థను రోడ్డున పడేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



కడప నగరం ఆర్టీసీ బస్టాండు వద్ద వీధి దీపాలు వెలగక అంధకారం

కమ్ముకున్న చీకట్లు

కడప కార్పొరేషన్: కడప నగరంలో కారు చీకట్లు అలుముకున్నాయి. అన్ని ప్రధాన రహదారులు, కూడళ్లలో వీధి దీపాలు వెలగకపోవడంతో నగరమంతా అంధకారంలో మునిగిపోయింది. జీవో నంబర్ 36 ప్రకారం తమకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12వ తేది అర్ధరాత్రి నుంచి కడప నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులు సమ్మె చేస్తున్న విషయం విదితమే. వీధి దీపాలను ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటలకు ఆన్ చేసి, తెల్లవారుజామున ఆరు గంటలకు ఆఫ్ చేయాల్సి ఉంది. కార్మికుల సమ్మె ప్రభావంతో వీధి దీపాలను ఆన్ చేసి, ఆఫ్ చేసే వారు లేకపోవడంతో వీధి దీపాలు వెలుగుకు నోచుకోలేదు. కొన్ని చోట్ల వెలుగుతున్న దీపాలు 24 గంటలు వెలుగుతూనే ఉన్నాయి.



ఏడు రోడ్ల కూడలిలో ..

సైనిక శిక్షణ శిబిరానికి ఆర్ట్స్ కళాశాల కేడెట్స్



సైనిక్ శిక్షణా శిబిరానికి ఎంపికైన ఎన్‌సీసీ క్యాడెట్స్‌తో ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ కెప్టెన్ నీలయ్య

కడప ఎడ్యుకేషన్: నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, క్రమశిక్షణ పెంపొందించుకోవడానికి సైనిక శిక్షణ శిబిరాలు ఉపయోగపడతాయని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి) ప్రధాన ఆచార్యులు డాక్టర్ జి రవీంద్రనాథ్ అన్నారు. జులై 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు సికింద్రాబాద్‌లో నిర్వహించబోయే ఆర్మీ అటాచ్మెంట్ క్యాంప్‌నకు ఆర్ట్స్ కళాశాల నుంచి 8 మంది ఎన్.సి.సి క్యాడెట్లుల తోపాటు అసోసియేట్ ఎన్.సి.సి అధికారి కెప్టెన్. డాక్టర్.నీలయ్య హాజరవుతున్నారని కళాశాల ప్రిన్సిపాల్ తెలియజేశారు. ఇందులో భాగంగా కెప్టెన్ డాక్టర్ నీలయ్య మాట్లాడుతూ ఈ క్యాంప్‌లో ఆయుధ ప్రదర్శన, వినియోగం, నిర్వహణ, ఫైరింగ్, శారీరక శిక్షణ, డ్రిల్, క్రీడా కార్యకలాపాలతో సహా రోజువారి సైనికుల దినచర్యను అనుసరిస్తారన్నారు. ఆర్మీ యూనిట్‌తో నివసిస్తూ శిక్షణ పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రమేష్ పాల్గొన్నారు.

ర్యాగింగ్ రహిత వాతావరణం కోసం కృషి

కడప అర్బన్: ర్యాగింగ్ రహిత వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలనీ కడప రిమ్స్ పిఎస్ ఎస్ఐ సుభాష్‌చంద్రబోస్ తెలియజేశారు. సోమవారం కడపలోని ప్రభుత్వ దంత వైద్య కళాశాలలోని ఆసుపత్రిలోని మినీ ఆడిటోరియంలో యాంటీ ర్యాగింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ క్యాంపస్‌లో ర్యాగింగ్ రహిత వాతావరణాన్ని పెంపొందించాలన్నారు. ఈ సమావేశం సందర్భంగా ఏర్పాటు చేసుకున్న యాంటీ ర్యాగింగ్ కమిటీలో ప్రభుత్వ దంతవైద్య కళాశాల వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పి. సురేష్, యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ కోటయ్య, డాక్టర్ శేషారెడ్డి, డాక్టర్ చక్రపాణి, డాక్టర్ దుర్గాభవాని, జయచంద్రారెడ్డి, డాక్టర్ దాశరథిలు వున్నారు.

పది రోజులు అవుతున్నా...



కడప నగరంలో ప్రధాన రహదారి అయిన రైల్వేస్టేషన్ రోడ్డు హరి ప్రియా హోటల్ ఎదుట గత పది రోజులక్రితం కాలువలో పూడిక తీసి రోడ్డు పైవేశారు. ఇంత వరకు ఆ మట్టి తొలగించక పోవడం తో మురికి కుప్పలు రోడ్డుపై దర్శనం ఇస్తున్నాయి. నగరంలో పారిశుధ్యం పడకేసింది అనడానికి ఈ చిత్రాలే నిదర్శనం.

– ఫొటో : సాక్షిఫొటోగ్రాఫర్, కడప

మాయ లేదు.. మర్మం లేదు..



కొందరు బాబాలు, తాంత్రిక మాయలతో ప్రజలకు బురిడీ కొట్టించి సొమ్మును కొళ్లగొడుతుంటారని.. వాటిని నమ్మవద్దని జన విజ్ఞాన వేదిక నాయకులు అంటున్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలు ముగింపు సందర్భంగా సంధ్య సర్కిల్ వద్ద ప్రదర్శన చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ ప్రదర్శనను ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

– ఫొటో : సాక్షిఫొటోగ్రాఫర్, కడప

కార్మిక సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె ఉధృతం



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే సమ్మె ఉధృతం చేస్తామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సీఐటీయూ) నాయకులు హెచ్చరించారు. సోమవారం కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జీవో నంబర్ 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు రూ.21000, రూ.24500 వేతనాలు పెంచి ఇవ్వాలన్నారు. పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్ అయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్లు రూ.75000 ఇవ్వాలని, కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు క్యాడర్ స్ట్రెంగ్త్ ఇవ్వాలన్నారు. మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు ఎస్. రవి, కె. తిరుపాల్, చంద్రారెడ్డి, గోపి, ఇ. ప్రకాష్, శ్రీరామ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల రిబ్బన్లు ధరించి నిరసన



కడప డివిజనల్ కార్యాలయం ఎదుట నల్ల రిబ్బన్లతో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రేడ్–2 జేఎల్ఎంలు

కడప కార్పొరేషన్: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న గ్రేడ్–2 జేఎల్ఎంల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక డివిజన్ ఇంజినీర్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ సంఘాలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించి గుర్తింపు కలిగిన సంఘంతో చర్చించి సమస్యలు పరిష్కరించాలన్నారు. గ్రేడ్–2 జేఎంఎల్ఎం లకు నూతన సర్వీస్ రూల్స్ రద్దు చేసి,పాత సర్వీస్ రూల్స్ ప్రకారం పదోన్నతులు కల్పించాలన్నారు. ఈపీడీసీఎల్‌లోని చీపురు పల్లి ఆర్ఈసీఎస్ పరిధిలో పనిచేస్తున్న గ్రేడ్–2 జేఎల్ఎంలకు ప్రొబేషన్ ప్రకటించి పే స్కేల్ అమలు చేయాలన్నారు. అక్టోబర్ 2019 నుంచి సచివాలయ ఉద్యోగులకు అమలవుతున్న సీఎల్, ఈఎల్ సెలవులు జేఎల్ఎం గ్రేడ్–2లకు కూడా అమలు చేయాలన్నారు. నిర్దిష్టమైన జాబ్ చార్ట్ జెఎల్ఎం గ్రేడ్–2లకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు శ్రీనివాసులరెడ్డి, రామచంద్రారెడ్డి, కుళ్లాయప్ప, ప్రకాష్ రాజ్, కె. నాగేంద్ర, శ్యామ్, సత్తార్, మహమ్మద్ పాల్గొన్నారు.

అధిక ఎరువుల వాడకంతో పర్యావరణ ముప్పు



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త మదన్‌మోహన్

కడప అగ్రికల్చర్: అధిక ఎరువులు వాడటం వల్ల పర్యావరణానికి ముప్పుతోపాటు నేల సమతుల్యతను కోల్పోతుందని తిరుపతి వ్యవసాయ కళాశాల అధ్యాపకుడు శ్రీనివాసచారి అన్నారు. ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 24వ తేదీ వరకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు సమగ్ర పోషక యాజమాన్యంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం నిర్వహించిన శిక్షణలో ఆయన సూక్ష్మజీవులు, బయో–ఇనోక్యులెంట్లు, బయో ఎరువులు, అజోటోబాక్టర్, ఫాస్ఫేట్ ద్రావణకాలు, అజోస్పిరిల్లమ్, బ్లూ గ్రీన్ ఆల్గే, బయో లిక్విడ్ ఎరువు (పంచగవ్య మొదలైనవి) గురించి వివరించారు. అలాగే రైజోబియం, అజోటోబాక్టర్ మరియు అజోస్పిరిల్లమ్ అనేవి ముఖ్యమైనవన్నారు. అలాగే నత్రజని ఫిక్సింగ్, బయో ఇనోక్యులెంట్లు పంటలకు నత్రజని లభ్యతను పెంచడంలో సహాయపడతాయన్నారు. తిరుపతి వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త మదన్‌మోహన్ మాట్లాడుతూ నేల ఆరోగ్యం స్థిరమైన ఉత్పాదకత కోసం సేంద్రీయ ఎరువులు పోషకాలను జోడించడంతో నేల నిర్మాణాన్ని మెరుగుపరచవచ్చన్నారు. అధిక ఎరువుల వాడకం పోషక ప్రవాహం, కాలుష్యం ద్వారా పర్యావరణానికి హాని కలిగిస్తుందన్నారు. ఈ విషయాలన్నింటిని రైతులకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యాయం అడిగితే అరెస్టులా..?



ఆర్‌సీపీ నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

కడప కోటిరెడ్డి సర్కిల్: దళితులు న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని 29 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తూ ఉంటే అధికారులు స్పందించకపోవడం , పోలీసులతో ఉద్యమాలను అణిచివేయాలని, టెంట్ ను తొలగించి దళితులను భయ భ్రాంతులకు గిరిచేయడం తగదని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి అన్నారు. సోమవారం కడప ఆర్డీవో కార్యాలయం ఎ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలైన దళితుల సమస్యలను పరిష్కరించాలని అడిగితే పోలీసులను పెట్టి అరెస్టు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు ప్రభుత్వాలు వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా న్యాయం అడుగుతున్న దళితులపై పోలీసుల ఉక్కు పాదాలను మోపడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. పాత కడప దళితుల భూమి సమస్య ను పరిష్కరించకుండా కాలయాపన చేస్తే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో ఏఐసీసీ కోఆర్డినేటర్ ఎస్ ఎ సత్తార్, దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మడగలం ప్రసాద్, వెంకటేష్, రాయలసీమ మహిళా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీదేవి,తస్లిమ్ రమేష్ బాబు, దివాకర్, గోపాల్, వీరయ్య, బాబు చిన్న సుబ్బయ్య ఉన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఓబయ్య, ఓబులేసు, సీపీఐ యం యల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి బ్బ్యా రాము, ఎమ్మార్పీఎస్ నాయకులు బీసీ గంగులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులకు సకాలంలో పరిష్కారం

కడప సెవెన్ రోడ్స్: ప్రజలు సమర్పించే ఫిర్యాదులను పరిశీలించి సకాలంలో వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో ఆమె ప్రజల నుంచి ఆర్జీలు స్వీకరించి పరిష్కార నిమిత్తం సంబంధిత శాఖలకు పంపారు.

–గత 19 సంవత్సరాలుగా అంగన్వాడీ ఆయాగా పని చేస్తున్న తనకు టీచర్‌గా పదోన్నతి కల్పించాలని కడప నగరం శంకరాపురం ఎస్. తోటి కాలనీకి చెందిన ఎస్ షాయిబీ కోరారు. ఆయాలకు టీచర్లుగా పదోన్నతి కల్పించి పని చేస్తున్న అంగన్వాడీ కేంద్రంలోనే నియమించాలని నిబంధనలు ఉన్నప్పటికి అధికారులు భేఖాతరు చేసి ఇతర ప్రాంతానికి చెందిన టీచర్‌ను నియమించారన్నారు. ఈ విషయాన్ని సూపర్‌వైజర్‌ను అడగ్గా సరైన సమాధానం చెప్పడం లేదని, విచారించి తనకు న్యాయం చేయాలని కోరారు.

–కెజీబీవీ, మోడల్ హాస్టల్స్‌లలో అకౌంటెంట్‌లు వార్డెన్లు, పార్ట్‌టైమ్ టీచర్లు, వంట మనుషులు, నైట్ వాచ్‌మెన్లుగా గత నవంబర్ నుంచి ఔట్‌సోర్సింగ్ కింద పని చేస్తున్న తమకు ఎనిమిది నెలలుగా వేతనాలు విడుదల చేయలేదని ఆ ఉద్యోగులు జేసీ ఫిర్యాదు చేశారు. తమ సమస్యను ఇన్‌చార్జ్ మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్ళగా స్థానిక ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు తీసుకురావాలని అంటున్నారని ఫిర్యాదు చేశారు.

–అంగన్వాడీ హెల్పర్ల పదోన్నతి విషయంలో జరుగుతున్న అవతవతకలపై విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్ కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలయ భూములు వేలం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆలయానికి సంబంధించిన భూముల వేలం, హుండీ ఆదాయాన్ని లెక్కించారు. సోములవారిపల్లె పంచాయతీలోని 39.84 ఎకరాల భూమికి వేలం వేయగా రూ.3,73,500 వచ్చిందని ఆలయ ఈఓ శ్రీధర్ తెలిపారు. హుండీ ఆదాయం లెక్కించగా రూ.1,27,657 ఆరు నెలలకు భక్తులు కానుక రూపంలో సమర్పించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆలయ చైర్మన్ రాజారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఉక్కపోతతో ప్రయాణికుల ఇబ్బందులు



కడప బస్టాండులో తిరగని ఫ్యాన్లు

కడప కోటిరెడ్డి సర్కిల్: జిల్లా ప్రధాన కేంద్రంలోని కడప ఆర్టీసీ బస్టాండు నుంచి నిత్యం వందలాది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు బస్సులలో రాకపోకలను సాగిస్తుంటారు. బస్సు రాక కోసం బస్టాండులో ప్రయాణికుల కోసం కూర్చునేందుకు కుర్చీలు ఉన్నాయి. ఉక్కపోత తగలకుండా ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. అయితే ప్రతి రోజు మధ్యాహ్నం ఉక్కపోతతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు మాత్రం ఫ్యాన్లు ఆఫ్ చేస్తున్నారు. విద్యుత్ సరఫరా ఉన్నా కూడా ఫ్యాన్లను ఆఫ్ చేయడం ఏమిటని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మధ్యాహ్న సమయంలో ఫ్యాన్లను ఆఫ్ చేయకుండా చూడాలని కోరుతున్నామన్నారు.

మహిళా జెడ్పీ చైర్ పర్సన్ పై దాడి హేయమైన చర్య

కడప కార్పొరేషన్: క్రిష్ణా జిల్లా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ హారికపై టీడీపీ, జనసేన నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. బాదుల్లా అన్నారు. సోమవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. బీసీల ఓట్లతో అందలం ఎక్కి బీసీల పార్టీ అని చెప్పుకుంటూ బీసీలపైనే దాడులు చేస్తున్నారని, సీఎం చంద్రబాబు ప్రజలను దారుణంగా మోసం చేస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం బీసీలకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తామని, బీసీ లకు రక్షణ చట్టం అమలు చేస్తామని, బీసీ మహిళలకు పెళ్లి కానుక కింద లక్ష రూపాయలు సాయం చే స్తామని అనేక హామీలు ఇచ్చారని, 14 నెలలు గడిచినా ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో ఇన్ని దారుణాలు జరుగుతున్నా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించకపోవడం దారుణమన్నారు.

ప్రజలపై భారం మోపడం తగదు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రభుత్వం ప్రజలపై పన్నుల రూపంలో, కరెంటు చార్జీల రూపంలో భారం మోపడం తగదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్ నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఆలంఖాన్ పల్లె లో సీపీఐ శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులాలు, మతాలు, ప్రాంతాలు, భాషలు ప్రాతిపదికన మనుషుల మధ్య వైషమ్యాలను రెచ్చగొడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న రోజువారి సమస్యలపై కమ్యూనిస్టులు మమేకం కావడం ద్వారా సీపీఐని బలోపేతం చేయాలన్నారు. ఆలంఖాన్ పల్లె సమగ్ర, సుస్థిర అభివృద్ధికి సీపీఐ ఉద్యమిస్తోందన్నారు. సీపీఐ నూతన శాఖ కార్యదర్శి గా నాగరాజు, సహాయ కార్యదర్శిలుగా నరసింహులు, పోతులూరయ్యలతో పాటు మరో ఆరు మంది తో కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి యన్ వెంకట శివ, నగర కార్యవర్గ సభ్యులు వడ్ల భాగ్యలక్ష్మి, శివ నాగేంద్ర, నాగరాజు, సోమారపు సుబ్బరాయుడు, నరసింహులు, భరత్, మమత , వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

సెమిస్టర్ పరీక్షలకు అవకాశం కల్పించాలి

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన యూనివర్సిటీ పరిధిలో చదువుతున్న డిగ్రీ విద్యార్థులకు 1,2,3,4 సెమిస్టర్ పరీక్షలలో కనీసం సెమిస్టర్ నుండి ఒక సబ్జెక్టుకు అవకాశం కల్పించాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యోగి వేమన యూనివర్సిటీ పరిధిలో చదువుతున్న డిగ్రీ విద్యార్థులకు గతంలో 1,2,3,4,5 సెమిస్టర్ పరీక్షలలో ఫెయిల్ అయిన విద్యార్థులకు అవకాశం కల్పించేవారని ప్రస్తుతం యూనివర్సిటీ అధికారులు అటువంటి అవకాశం కల్పించకుండా విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌బి జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్ర, అఖిల్, సుహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీర్‌ను విధుల నుంచి తప్పించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప నగరపాలక సంస్థలో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న చెన్నకేశవరెడ్డి సంవత్సరాల తరబడి వివిధ హోదాల్లో తిష్టవేసి అభివృద్ధికి ఆటంకం కలిగిస్తూ కాంట్రాక్టర్స్ కు కొమ్ముకాస్తున్నారని, ఆయనను విధుల నుంచి తప్పించాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసీ.బాదుల్లా డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక హోచిమిన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప నగరపాలక సంస్థ పరిధిలో అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య ఉన్న ఆధిపత్యపోరును ఆసరాగా చేసుకున్న ఇంజనీరింగ్ అధికారులు అభివృద్ధి పనుల పై దృష్టి సారించడం లేదన్నారు. సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలంటే ప్రస్తుత వర్షాకాలం వచ్చిందంటే మరో రెండు నెలలు ఆగాల్సిందేనని, దీనికి అధికారులు నోరు విప్పాలని డిమాండ్ చేశారు. బుగ్గ వంక ఇరు పక్కల రోడ్డు పనులు సంవత్సరాలు తరబడి కొనసాగుతున్నాయని, ఎప్పటికి పూర్తి చేస్తారో ఇంజనీరింగ్ అధికారులు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లింగన్న పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ఎండగడదాం

వీరపునాయునిపల్లె: కూటమి ఏడాది పాలనలో ఎన్నికల హామీలు అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబుతో సహా కూటమి నేతలు చేస్తున్న మోసాలను ఇంటింటికి వెళ్లి ప్రజల వద్ద ఎండగడదామని కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి పిలుపునిచ్చారు. మండల కన్వీనర్ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వీరపునాయునిపల్లెలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ క్యూర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మోసాలకు అంతులేకుండా పోయిందని విమర్శించారు. మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అని చెప్పి, గత సంవత్సరంలో ఒక్క సిలిండర్‌నే కేటాయించిందని, పలు నిబంధనలతో కొంతమందికే పథకం పరిమితం చేసినప్పటికీ నేటికీ చాలామంది ఖాతాల్లో సబ్సిడీ డబ్బులు వెయ్యలేదని విమర్శించారు. అన్నదాతలు పెట్టుబడి సహాయం కింద రైతు భరోసా పథకానికి సుఖీభవ అనే పేరు మార్చిన రైతన్నలకు ఇస్తామన్న 20 వేల నగదును నేటికీ ఇవ్వలేదన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. అక్రమ అరెస్టులతో భయానక వాతావరణం సృష్టిస్తున్నారని బెదిరింపులకు భయపడే ప్రసక్తేలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేసేంతవరకు పార్టీ తరఫున పోరాడుతామని ప్రకటించారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు గ్రామ స్థాయిలో సమావేశాలు నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ మోసాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.